# కతలవ్వ

"**సూరప్పకొండ** ఈసారి పొగిలి పోద్ది." అన్నాడు చిన్నెంరెడ్డి. రామాలయం ఎదురుగా పెద రావి చెట్టు దాన్ని కావిలించుకుని ఒళ్లు పగిలిన రచ్చబండ. హుసేను సాయిబు తువాల్తో తలపాగ చుట్టుకున్నాడు. నోట్లో రెండు మూడు పళ్లు. బుగ్గలమీంచి అన్నే వెంట్రుకల గడ్డం. లోతు కళ్లూ, ఎనభైఏళ్లపాటు ఉతికి ఆరేసినన గుడ్డలాంటి చర్మంతో సాయిబు ఊరంతా గౌరవించే మాజీ దూదేకుల రారాజు. ఒక పనివాడు, ఇద్దరుకొడుకుల్తో కచేరీకి వెడుతున్న వీణ కళాకారుడిలా ఏకులకర్ర తీసుకుని పట్నానికీ చుట్టూరా గ్రామాలకీ దర్జాగా వెళ్లి వస్తూండేవాడు. మూడెకరాల పొలం హుసేను ఏకిన దూదిపింజల్లాంటి మబ్బులు నీటిదారాలై సాగినప్పుడు పండేది. పెద్దగా ఇబ్బంది లేకుండా కాలం గడిచిపోయేది. ఊరికి వాయవ ఒచ్చి పడింది. రావి చెట్టుకి కూడా చివరికి మాట పడిపోయింది. పగలూ రాత్రీ వేడి గాలి దెయ్యాలు ఊరంతనీ పీల్చి పిప్పిచేశాయి. ఎండ్లకీ వేడికీ సూరప్పకొండ ఒణుకుతా ఉంది. ఇటువంటి పది ఊళ్లకి అమ్మోరిలా నీళ్లిచ్చే గంగరాజు బావి హుసేను సాయిబు నోటిలా ఎండిపోయింది.

"పాపం పెరిగిపోయింది హుసేనూ, కరువులొచ్చి మనుషుల్ని మనుషులే పీక్కు తింటారని బ్రమ్మంగారు చెప్పలే? దీనమ్మ. మనూరి కొండగూడా పాపం మాదిరి ఉంది."

"మనవందరం చచ్చిపోతాం. ఊరు పాడుబడుద్ది. ఏమి కర్మ రెడ్డీ." అన్నాడు హుసేను.

"తాగటానికి నీళ్లు గూడా లేకపాయ. చావకేం చస్తావా?"

"బాగా ఎండలు గాస్తే మంచి వానలు పడేది. ఇప్పుడు ఎండలు తప్ప వానల్లేవు."

సాయంత్రాలు పిల్లకాయలు పొలాల్లో గిల్లాకర్ర ఆడుతున్నారు. ఎండిపోయి పిల్లల కళ్లు గాజుగోళీకాయల్లా ఉన్నాయి. పొలాల చివర అప్పుడప్పుడు సుడిగాలి తిరిగి ఆకాశానికి ఎర్రమట్టి పోస్తూంటుంది. నీళ్లు లేక కాకులు కూడా చచ్చిపోతున్నాయి. ఊళ్లో సీతాసమేత శ్రీరామచంద్రమూర్తిగారు గానీ ఊరి బయట ఇటుకల గుళ్లో వేంచేసిన గ్రామదేవతగానీ కలిగించుకోవడం మానేశారు. కరువు చిచ్చులో ఊరంతా తెల్లగా నుసి అవుతోంది.

రాత్రి అందరూ నిద్రపోతున్నారు. పిల్లలు ఆడి ఆడి అలసిపోయి, పెద్దలు చాలామంది నీరసించి కరువు తాకని నిద్రలోకంలోకి వెళ్లిపోయారు. వెన్నెల రాత్రి. ఎప్పుడో అర్ధరాత్రి దాటేక ఊరు చల్లబడింది. కరువుతీరా విపరీతంగా కుండపోతగా కురుస్తోంది వెన్నెల.

ఆ రోజు మధ్యాహ్నం రాయుడు కాపు పురుగుమందు తాగి కరువు బాధ తప్పించుకున్నాడు. సాయంత్రం సూరీడుతోపాటు రాయుడు కాలిపోయాడు. ఊరంతా రెండు కళ్లు చేసుకుని ఏడిచింది. రాయుణ్ని కాల్చినచోట కూడా వెన్నెల పడుతోంది. పొలంలో తిరుగుతోన్న తాచుపాము తళతళ మెరుస్తోంది. బయట మంచాలు వేసుకుని అందరూ వెన్నెట్లో తడుస్తున్నారు.

ఉన్నట్టుండి రావిచెట్టు గలగలమంది. గిర్రున గాలి తిరిగింది. గాలికి వెన్నెల జలదరించింది. రావి ఆత్రంగా మాటలు మొదలు పెట్టింది. తెలకుల వెంకట్రావు కొడుకు కోడలు మనవడు మిద్దె మీద పడుకున్నారు. గుడి దగ్గిరే ఇల్లు. మనవడు వెంకట్రావుకి గబుక్కున మెళకువ వచ్చింది. చెక్క మెట్ల మీంచి దిగి రోడ్డు పక్కన ఒంటేలుపోసుకుంటూ గుడివేపు చూశాడు. వాడి గుండె ఝల్లుమని కాలి మీద పోసుకున్నాడు. నిద్రెగిరిపోయింది. రావి చెట్టు కింద ఎవరో కూచుని ఉన్నారు. తెల్ల జుట్టు కనిపిస్తోంది. గుడ్లప్పగించి అటే చూస్తుంటే భయం తగ్గింది. ఆమె చెట్టుకింద మఠం వేసుకుని కూచుంది. పక్కనే పెద్ద బుట్ట, దాని పక్కనే గుమ్మడి కాయ తంబుర. ఆమె వెంకట్రావుని చూసింది. చెయ్యి ఊపి రమ్మని పిలిచింది. క్షణం ఆగి మంత్రం వేసినట్టు ఆమె దగ్గిరి కెళ్లేడు. వెంకట్రావుని చూడగానే నవ్విందామె. చేత్తో రెండు బుగ్గల్నీ నిమిరింది. వెన్నెల ఏకి నేసినట్టున్న తెల్లజుట్టు, చామన చాయ, పెద్ద ముఖం. నీలం రంగుబొట్టూ పెద్ద నోరూ, సగం వెన్నెట్లో సగం చెట్టు నీడలో అవ్వ దేవతలా ఉంది.

"అవ్వానీదే ఊరు?"

"చానాదూరం."

"మా ఊరెందు కొచ్చేవు?"

"మీకు కతలు చెప్పడానికి."

"కథలు చెప్తావా నువ్వు?"

చేతిలోకి తంబుర తీసుకుని అంది.

"ఊ. బోలెడు కదలు చెప్తా."

వాడు ఆమె కాళ్లవేపు చూశాడు.

"అవ్వా, నువ్వు దెయ్యానివా?"

అవ్వ మెత్తగా నవ్వింది.

"దెయ్యాలేడున్నయి? నువ్వు చూశావా? నువ్వెళ్లి పిల్లకాయల్ని లేపి తీసకరా. జాగర్త. పెద్దోళ్లు లేస్తారు. ఈగలాగ ఎళ్లిరా."

"ఎందుకు?"

"కతల్చెప్తా. పోయిరా మరి."

వాడు ఇంటివేపు ఒకసారి చూశాడు. టైరు చక్రం తీసుకుని కారు మీద వెళ్దావా వద్దా అని క్షణం సందేహించి కారు లేకండానే పరిగెట్టాడు. పదిహేను నిముషాల్లో రావి చెట్టు కింద ఊళ్లో పిల్లలు చాలామంది చేరేడు. మనవడు. వెంకట్రావు అవ్వకి దగ్గిరిగా కూచున్నాడు. కొమ్మకి తొడిగిన ఆకులమల్లే అవ్వ చుట్టూరా కళ్లింత చేసుకుని కూచున్నారంతా.

రావి ఆకుల ఏవేవో మాట్లాడుతున్నాయి. అవ్వ తల ఎత్తి నల్లటి పెద్ద కళ్లతో పైకి చూసింది. పిల్లలందర్నీ చూసి నవ్విందామె. ఎంత వెన్నెలగా ఉన్నా రోజంతా తగలబడిన పొలాల వేడి నెర్రెల్లోంచి బయటపడుతోంది. అవ్వ బుట్ట తెరిచింది. లోపల్నించి బెకబెకమని శబ్దాలు వినిపించేయి. రెండు చేతుల్తో బుట్టసర్ది మెల్లిగా లోపల్నించి దొంతర్లు దొంతర్లు మబ్బుల్ని బయటికి తీసింది. పెద్ద పెద్ద దుప్పట్లంత మబ్బులాగి బుట్ట మూసింది. మబ్బుల్ని ఒళ్లోకి లాక్కుని రెండు చివర్లూ దుప్పటి పట్టుకున్నట్టు పట్టుకుని పిల్లల మీదికి మెత్తగా ఒదిలింది అవ్వ. తెలినీలి రంగులో మబ్బుల దుప్పటీ కొంచెం పైకి తేలి గుండ్రంగా కూచున్న పిల్లలందర్నీ చల్లగా సిల్కులా కప్పేసింది. ఒళ్లు జల్లుమని పిల్లలకి కిసుక్కుమని నవ్వేరు. అందరూ మెరుస్తోన్న కళ్లతో అవ్వవేపు చూశారు.

"నే రోజూ వస్తా. మీ నేస్తగాళ్లకి చెప్పండి. పెద్దోళ్లకి చెప్పమాకండి. రోజూ రాత్రి ఇక్కడికే రండి. సరేనా?"

అందరూ తలూపేరు.

"అనగనగ ఒక పొట్ట రాక్షసుడుండేవాడు. వాడి పొట్ట మన సూరప్ప కొండమాదిరి ఉంటుంది. పేద్ద పొట్ట. దాన్ని మొయ్యడానికి వాడికి రావిచెట్ల మాదిరి లావుగా పెద్ద కాళ్లుండేవి. అంత పెద్ద పొట్ట చూసి అందరూ వాణ్ని పొట్ట రాక్షసుడనీ బొడ్డు రాక్షసుడనీ అనేవారు. ఆడి బొడ్డు కూడా పెద్దది. మీ రందరూ ఆడి బొడ్డు నిచ్చెనేసుకుని ఎక్కాల్సిందే. ఆ పొట్టేసుకుని మెల్లిగా భూమ్మీద నడిచేవాడు. బొడ్డు రాక్షసుడంటే అందరికీ భయం. వాడు నడుస్తా ఉంటే వాడి పొట్ట సముద్రంలాగ పైకీ కిందికీ కదుల్తా ఉండేది. ఒకసారి బొడ్డు రాక్షసుడు బూవికి అడ్డంగా పండుకోనున్నాడు. ఇంతలో భళ్లుమని ఆకాశం బద్దలైంది. ఆకాశం నిండా తెల్లటి మెరుపులు. కుండపోతగా వాన. వెండి దారాల మాదిరి వర్షం. ఒకటే వర్షం. ఆ వర్షంలో బూవంతా సముద్రం అయిపోవాలన్నమాట. అంత వర్షం. కురిసి కురిసీ ఎన్నాళ్లు కురిసిందో ఎరుగుదురా? నెలరోజులు. కానీ బూమ్మీద ఒక్క చుక్క పడలా. మొత్తం వర్షం అంతా నోరెళ్లబెట్టి బొడ్డు రాక్షసుడు తాగేశాడు. మొత్తం."

పిల్లలందరి కళ్లూ పెద్దవయ్యాయి. వాళ్ల కళ్ల ఎదురుగా కుంభవృష్టి. బొద్దు రాక్షసుడు ఆకాశం నించి ధారలుగా పడుతోన్న నీటిని తాగేస్తున్నాడు. ఆగి మళ్లీ కథ అందుకుంది అవ్వ.

"నెల రోజులు కురిసినాక వర్షం ఆగిపోయింది. సూర్యుడు మబ్బుల్ని పక్కకి నెట్టుకుని చూసి బిత్తరపోయాడు. ఏం చెయ్యాలో తోచలేదు. గుబులు పుట్టింది. ఇట్లాకాదని రాత్రి మబ్బులన్నీ గుంపులు గుంపులుగా కూచున్నాయి. కుమ్మరోడు కుండ చేసినట్టు మబ్బుల్లోంచి ఒక వీరుణ్ని తయారు జేసాయి. సూరీడు కాసిని బంగారు కిరణాలు మెలిదిప్పి కిరీటం పంపించేడు. సూర్యుడు మాదిరి మెరిసిపోతా ఉందది. కొన్ని మబ్బులు కవ్వం చిలికినట్టు చిలికి చిలికి పెద్ద వెండి కత్తి తయారు చేసినయి. ఏందది? మెరుపులు మెరిసినట్టు దగదగ మెరుస్తా ఉంది. అసలు దాన్ని ఎవరూ మోయలేరు. వీరుడికి ఆ కత్తి చేతికిచ్చేయి.

కాసేపటికి ఆకాశం బద్దలైనంత ఉరుమురిమింది. ఆ శబ్దానికి అసలు బూవి బద్దలైపోయేది. ఆకాశం మీంచి గాండ్రిస్తూ ఒకేసారి వెయ్యి సింహాలు బూవి మీదికి దుంకినట్టుంది. బూవంతా ఎలిగిస్తూ మెరుపులుమెరిసేయి. కత్తి మెరుపులో వీరుడు మెరిసిపోతున్నాడు. మబ్బుల రథం ఎక్కి కూచుని బూవిమీదికి దిగేడు. బొద్దు రాక్షసుడు మామూలుగా అడ్డంగా పండుకుని ఉన్నాడు. వీరుణ్ని వాడు చూడలేదు. వీరుడు నేరుగా రథంమీంచి రాక్షసుడి పొట్టమీదికి దూకేడు. అమ్మ బాబోయి అని గింజుకున్నాడు వాడు.

వీరుడు వెండికత్తిని ఎత్తేడు. పెద్దంగా అరిచేడు రాక్షసుడు. అంతే కత్తి ఎత్తి ఒక్కసారి రాక్షసుడి బొద్దుని తెగనరికేడు వీరుడు. నరకంగనే బొద్దు కొండంత గోలికాయమాదిరి దొల్లుకుంటూ పోయింది. రాక్షసుడు బూవి బద్దలయ్యేతట్టు పొలికేకలు పేట్టేడు. మళ్లీ కత్తి ఎత్తేడు వీరుడు. ఒక్క వేటుతో రాక్షసుడి పొట్ట నరికేడు. అంతే."

అవ్వ ఆగింది పిల్లల నోళ్లు తెరుచుకున్నాయి. రాక్షసుడి గావుకేకలు వినబడుతున్నాయి.

"బూవంత నీళ్ల బాన బద్దలైనట్టు ఆడి పొట్టలోంచి నదులన్నీ పొంగి బయటబడ్డాయి. ఎన్ని వాగులో,ఎన్నివంకలో. మళ్లీ వెండి కత్తి ఎత్తి రాక్షసుడి పీక అడ్డంగా తెగనరికేడు వీరుడు. పీక తెగడం, గొంతులోంచి ఆ వంతున పెద్ద శబ్దం చేసుకుంటూ పెద్ద నీటి దార బయటపడ్డం జరిగిపోయింది. వీరుడు మళ్లా మబ్బుల్లోకి పోయినాడు. బూవంతా చల్లబడిపోయింది. నదులు పొంగిపోయినయి. కరువు తీరిపోయినయ్."

పిల్లలందరూ ఎగిసిపడే వాగుల వేపు వంకలవేపూ చూస్తున్నారు. ఎక్కడ చూసినా నీళ్లే. పొలాలన్నీ నీటితో తళతళ లాడుతున్నాయి. తుంబుర పక్కన పెట్టి నవ్వుతూ పిల్లలవేపు చూసి అంది అవ్వ.

"ఇంక మీరెల్లి పండుకోండి. ఎవరికీ చెప్ప మాకండి. నేను రోజూ వస్తా ఉంటా."

అవ్వ వెన్నెల్లా నవ్వింది. పిల్లలందరూ ఆమెవేపు ఇష్టంగా చూశారు. ఆమె నవ్వుతూరెండు చేతులూ ముందుకు చాపింది. పిల్లల వీపుల మీంచి మబ్బు మెల్లిగా లేచి అవ్వ చేతుల్లోకి ఒచ్చింది. జాగ్రత్తగా మడిచి బుట్టలో పెట్టుకుందామె. పిల్లలందరూ లేచి చప్పుడు చెయ్యకుండా వెనక్కి చూస్తూ వెళ్లిపోయారు. వెంకట్రావు నిచ్చెనెక్కుతూ రావి చెట్టు కింద చూశాడు. ఖాళీగా ఉంది. రావి చెట్టు ఆకుల స్తబ్దుగా ఉన్నాయి.

మర్నాడు సాయంకాలానికల్లా పిల్లలందరూ కూడ బలుక్కున్నారు. రోజూ అర్ధరాత్రి దాటేసరికి బిల బిల మంటూ చెట్టు మీంచి మెత్తగా దిగే ఉడతల్లా రావిచెట్టు దగ్గిరికి చేరుతున్నారు. అవ్వ కథలు చెప్తోంది. ఎన్ని కథలో. ఒకరోజు విత్తనం కథ చెప్పింది.

అమ్మవారి అరచేతిలో విత్తనం ఉండేది. ఊళ్లో ఆడవాళ్లందరూ అమ్మకి మొక్కి ఇంట్లో విత్తనాలు పొలాలకి తీసికెళ్లి జల్లేవారు. రాత్రి పూట అమ్మవారు నవ్వేది. మర్నాడు విత్తనాలన్నీ మొక్కలైపోయాయి. ఒకసారి ఒక బొల్లి రాక్షసుడు అమ్మవారి చేతిలో విత్తనం కాజేశాడు. అంతే. పొలాలన్నీ బీళ్లయి పోయాయి. ఎన్ని కథలో. ఇప్పుడు పిల్లల కళ్లు మెరుస్తున్నాయి. బాగా ఎండెక్కే వరకూ నిద్రలేవడం లేదు. నిద్దట్లో నవ్వుకోడం చాలామంది పిల్లలకి మామూలై పోయింది. ఉదయం, సాయంత్రం గుంపులుగా చేరి పిల్లలు రహస్యాలు మాట్లాడుకుంటున్నారు. ఇదంతా పెద్దవాళ్లు గమనించకపోలేదు. కానీ వాళ్లకేవీ అర్థం కాలేదు. పగలంతా ఆడుతూ పాడుతూ ఎప్పుడూ సంతోషం గుర్రాలెక్కి తిరుగుతున్నారు. ఇది వరకు గిల్లాకర్ర దగ్గిర, టైరుచక్రం పందేల దగ్గిర తిట్టుకోడం చొక్కాలు చింపుకోడం ఉండేది. ఇప్పుడదేమీ లేదు. చీకటి పడీ పడగానే నాలుగు మెతుకులు తిని పడు కుంటున్నారు. ఒకరోజు మబ్బుల్ని మడతపెట్టుకని అవ్వ అంది.

"నేనింక రాను. సరేనా?"

పిల్లలందరికీ ఏడుపొచ్చింది.

"ష్. ఏడవమాకండి తప్పు. మళ్లీ వస్తా."

అవ్వ ఒక్కొక్కళ్లనీ దగ్గిరికి పిలిచి చెవిలో ఏదో చెప్పింది.

వాళ్ల ముఖాలు వెలిగిపోయాయి.

గుంపులుగా మెత్తగా ఉడతల్లా ఇళ్లకి వెళ్లిపోయారు.

వెంకట్రావు మిద్దె మెట్టెక్కుతూ ఆఖరిసారి రావి వేపు చూశాడు.

అవ్వ అక్కడ లేదు.

❖ ❖ ❖